ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

జాతీయ వార్తలు

తేదీ: 20.07.2024 సమయం: 12.30 గంటలు

ముఖ్యాంశాలు

1. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రానున్న 48 గంటలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపధ్యంలో, తెలంగాణలో రెడ్ అలర్ట్ జారీ చేసిన 10 జిల్లాల్లో అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని భారత వాతావరణ శాఖ పేర్కొంది.

2. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ దేశ వ్యాప్తంగా విమాన సేవలు సాధారణ స్థితికి వచ్చాయని తెలిపింది.

3. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భం గా ప్రభుత్వం రేపు అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తోంది.

4. మినరల్ ఎక్స్ ప్లోరేషన్ హ్యాకథాన్, క్రిటికల్ మినరల్ రోడ్ షో ను కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి G కిషన్ రెడ్డి ఈ ఉదయం హైదరాబాద్ లో ప్రారంభించారు.

TELANGANA-RAINS

తెలంగాణలోని పలు ప్రాంతాల్లో నిన్నటి నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ములుగు, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెంతో సహా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. ములుగు జిల్లా ఆలుబాకలో ఈ ఉదయం 6 గంటల వరకు అత్యధికంగా 98.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈరోజు, రేపు భారత వాతావరణ శాఖ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రెడ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ తోసహా 10 జిల్లాల అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. మిగిలిన చాలా

జిల్లాలకు IMD ఆరెంజ్ అలర్ట్ కూడా జారీ చేసింది. మరోవైపు భారీ వర్షాలు కురుస్తున్నందున అన్ని నీటి వనరులపై నిఘా ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. వర్షాల వల్ల  ప్రాణనష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆమె జిల్లా అధికారులను ఆదేశించారు.

IMD-WEATHER

ఇదిలా ఉండగా, గుజరాత్, కొంకణ్, గోవా, కోస్టల్ కర్నాటక, దక్షిణ అంతర్ కర్నాటకలో ఈరోజు అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం అంచనా వేసింది. ఈరోజు కేరళ, తెలంగాణ, కోస్తాంధ్ర, ఒడిశా, విదర్భ, ఛత్తీస్‌గఢ్ మధ్యప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలలో, మధ్య మహారాష్ట్ర, కోస్తా, దక్షిణ అంతర్ కర్ణాటకలో రాబోయే 4 రోజులలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని IMD తెలిపింది. ఇదిలా ఉండగా, ఈరోజు జార్ఖండ్  గంగా పరివాహక పశ్చిమ బెంగాల్‌లో, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, హర్యానా, తూర్పు రాజస్థాన్ ఉత్తర అంతర్ కర్నాటకలో రాబోయే 4 రోజులలో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. రాబోయే 3 మూడు నుండి 4 రోజుల్లో నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్, అస్సాం  మేఘాలయలో కూడా ఇలాంటి పరిస్థితులు ఉంటాయని వాతావరణ సంస్థ తెలిపింది.

OVERALL WORLDWIDE-IT OUTAGE

ప్రపంచవ్యాప్తంగా విమాన సర్వీసుల నుండి ఆరోగ్య పరిరక్షణ సేవల వరకు పలు సేవలు నిన్న గంటల తరబడి కంప్యూటర్ వ్యవస్థలను ప్రభావితం చేసిన భారీ సమాచార సాంకేతిక అంతరాయం తర్వాత నెమ్మదిగా కోలుకుంటున్నాయి. మైక్రోసాఫ్ట్ సాఫ్ట్ వేర్ అంతరాయం కారణంగా ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది ప్రజలు ప్రభావితమయ్యారు. అమెరికా సైబర్-భద్రత సంస్థ క్రౌడ్‌స్ట్రైక్ మైక్రోసాఫ్ట్ విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్‌పై ప్రభావం చూపిన సాఫ్ట్ వేర్ అప్‌డేట్‌ను

ప్రపంచవ్యాప్తంగా పనికిరాకుండా చేయడంతో వ్యాపారాలు, బ్యాంకింగ్ సేవలు, ఆసుపత్రులు విమానయాన కార్యకలాపాలు అతిగా దెబ్బతిన్నాయి.

HYDERABAD-FLIGHTS

ఇదిలా ఉండగా మైక్రోసాఫ్ట్ క్లౌడ్ సర్వీసెస్ అంతరాయం కారణంగా హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో వివిధ విమానయాన సంస్థలకు చెందిన సుమారు 30 సర్వీసుల విమాన కార్యకలాపాలు నిలిచిపోయాయి. నిన్న సాయంత్రం వరకు, విమానాశ్రయానికి వచ్చే, విమానాశ్రయం నుండి బయలుదేరే 36 విమానాలు రద్దు అయ్యాయి.

CIVIL AVIATION – AIRPORT

కాగా, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ దేశ వ్యాప్తంగా విమాన సేవలు సాధారణ స్థితికి వచ్చాయని తెలిపింది. మైక్రో సాఫ్ట్ ఔటేజ్ కారణంగా నిన్న విమాన సేవల కార్యకలాపాలకు అంతరాయం కలిగింది. నిన్న సంభవించిన అంతరాయం కారణంగా ఏర్పడిన స్తంభనలు క్రమంగా సద్దుమణుగుతున్నాయని తెలిపింది. ప్రభుత్వం నిరంతరం విమానాశ్రయాల వద్ద కార్యకలాపాలను పర్యవేక్షిస్తోందని, అలాగే విమానయాన సంస్థలు నడిపే ప్రయాణాల రాకపోకల మార్పులు, పునరుద్ధరణ, ఛార్జీలను తిరిగి ప్రయాణికులకు ఇవ్వడం వంటి అంశాలను కూడా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది.

GOVT - ALL PARTY MEET

పార్లమెంట్ లో బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రభుత్వం రేపు అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తోంది. ఈ సమావేశంలో ఉభయ సభలు సజావుగా సాగడానికి వారి సహకారాన్ని కోరనుంది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఎల్లుండి నుంచి ప్రారంభమై వచ్చే నెల 12వ తేది

వరకు కొనసాగుతాయి. ఈనెల 23వ తేదిన కేంద్ర బడ్జెట్ ను ప్రవేశపెడతారు. నరేంద్రమోదీ మూడవసారి అధికారాన్ని చేపట్టిన తర్వాత ప్రవేశపెడుతున్న మొదటి బడ్జెట్ ఇది. గత నెలలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించినప్పుడు బడ్జెట్ ను కేంద్ర ప్రభుత్వ దార్శనీకతను, భవిష్యత్ విధానాలను సూచించే ప్రభావవంతమైన పత్రాలుగా పేర్కొన్నారు.

TELANGANA-SKILL UNIVERSITY BILL

తెలంగాణ నైపుణ్య విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సంబంధించిన బిల్లును శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు సిద్ధంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న నైపుణ్య విశ్వవిద్యాలయంలో 17 కోర్సులు అందించడంతో పాటు ప్రతి సంవత్సరం 20 వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. మొదటి సంవత్సరంలో 2 వేల మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించి ఈ ఏడాదిలోనే విశ్వవిద్యాలయం ప్రారంభంపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా హాజరయ్యారు. మూడు - నాలుగు సంవత్సరాల వ్యవధి గల డిగ్రీ కోర్సులతో పాటు, విశ్వవిద్యాలయం ఒక సంవత్సరం డిప్లొమా కోర్సులు, మూడు - నాలుగు నెలల సర్టిఫికేట్ కోర్సులను అందించాలని కూడా నిర్ణయించినట్లు అధికారిక ప్రకటన తెలిపింది. ముందుగా ఆరు రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించే కోర్సులను ప్రవేశపెడతారు. ప్రతి కోర్సుకు సంబంధిత రంగంలో నెలకొల్పిన సంస్థతో అనుబంధం ఉండటమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు ఆయా సంస్థలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటుంది.

MINERALS:

మినరల్ ఎక్స్ ప్లొరేషన్ హ్యాకథాన్, క్రిటికల్ మినరల్ రోడ్ షో ను కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి G కిషన్ రెడ్డి ఈ ఉదయం హైదరాబాద్ లో ప్రారంభించారు. మైనింగ్ రంగంలో మరింత అభివృద్ధి సాధించేందుకు ఈ కార్యక్రమం దోహద పడుతుందని పేర్కొన్నారు. క్రిటికల్ మినరల్స్ కు సంబంధించిన 2,3 విడతల ఈ-ఆక్షన్ కు సంబంధించి ప్రిఫర్డ్ బిడ్డర్స్ కు కాంపోజిట్ అనుమతి పత్రాలను మంత్రి అందజేశారు. ఖనిజ రంగంలో ముఖ్యంగా, క్రిటికల్ మినరల్స్ రంగంలో దేశం ఆత్మనిర్భరతను సాధించే దిశగా భాగస్వాములంతా కలిసి పనిచేయాలని కేంద్ర బొగ్గు గనుల శాఖమంత్రి G కిషన్ రెడ్డిచెప్పారు. ప్రస్తుతం బొగ్గురంగంలో దేశం ఇప్పటికే స్వాలంబన సాధించిందన్నారు. రానున్నకాలంలో ఖనిజ తంగంలో మరిన్ని సంస్కరణలు, విధాన నిర్ణయాలు చేయనున్నట్లు చెప్పారు.

DAY AMIT SHAH-JHARKHAND

కేంద్ర హోం మంత్రి, సీనియర్ బిజెపి నాయకుడు అమిత్ షా జార్కండ్ లోని రాంచీలో ఈరోజు పర్యటిస్తారు. అక్కడ ఆయన రాష్ట్ర బిజెపి కార్యనిర్వాహక కమిటి సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారు. దీంతో పాటు ఆ పార్టీ రాష్ట్ర కోర్ గ్రూప్ సమావేశంలో కూడా ఆయన పాల్గొని పార్టీ కార్యకర్తలతో ముచ్చటిస్తారు. ఈ సందర్భంగా ఆయన ఇటీవల ముగిసిన లోక్ సభ ఎన్నికల్లో ఎన్డీఏ పార్టీలతో పాటు బిజెపి ప్రగతిపై సమీక్ష నిర్వహిస్తారు. ఈ సంవత్సరం ఆఖరులో ఆ రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరగనున్నాయి.

BIHAR-FILM POLICY

బీహార్లో కొత్త చలనచిత్ర ప్రచార విధానం ఉద్దేశ్యం ఆ రాష్ట్రంలో కళ, సంస్కృతి, భాష మాండలికాలను ప్రోత్సహించడం, ఆ రంగంలో ఉద్యోగ అవకాశాలను సృష్టించడం రూపొందించడం జరిగింది. మైథిలి, భోజ్‌పురి, మాగాహి, అంజికా బజ్జికలలో చలనచిత్రాలు,

రూపకాలు, OTT చలనచిత్రాలు  దృశ్య ధారావాహికలను నిర్మించే చలనచిత్ర నిర్మాతలు ఈ విధానం కింద ప్రత్యేక ఆర్థిక గ్రాంట్లు పొందుతారు. చలనచిత్రం నిర్మాణాలు, ఇతర లాంఛనాల అనుమతి ప్రక్రియ సాఫీగా జరగాలంటే రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీలు ఉంటాయి. సినిమా నిర్మాణ రంగంలో దేశంలోనే పెద్ద కేంద్రంగా బీహార్‌ను అభివృద్ధి చేయడం ఈ విధానం  ప్రధాన లక్ష్యంగా ఉంది.

## ASIA CUP WOMEN'S CRICKET

మహిళల ఆసియా కప్ T20 క్రికెట్‌లో భాగంగా ఈరోజు మధ్యాహ్నం 2 గంటలకు శ్రీలంకలోని దంబుల్లా మైదానంలో మలేషియా జట్టు, థాయిలాండ్ జట్టు తలపడుతుంది. సాయంత్రం 7 గంటలకు ఇదే మైదానంలో జరిగే మరో మ్యాచ్ లో బంగ్లాదేశ్ తో శ్రీలంక తలపడనుంది. అంతకుముందు ఇదే వేదికపై నిన్న సాయంత్రం జరిగిన మ్యాచ్ లో భారత్ 7 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను ఓడించింది.

## PM-MANN KI BAAT:

ఈనెల 28వ తేదీన ప్రసారం కానున్న మన్ కీ బాత్ ప్రసంగానికి ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో సలహాలు, సూచనలు రావడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో ఈ విషయం తెలియజేస్తూ నరేంద్రమోదీ తన ప్రసంగంలో ప్రస్తావించవలసిన అంశాల గురించి తనకు అసంఖ్యాకంగా సూచనలు లభిస్తున్నాయని చెప్పారు. ముఖ్యంగా సమాజాన్ని పరివర్తనం చేసేందుకు చేస్తున్న సమిష్టి ప్రయత్నాల గురించి మాట్లాడవలసిందిగా అనేక మంది యువజనులు తనకు సూచించడం ఎంతో సంతోషకరమని ప్రధానమంత్రి అన్నారు. మై గౌవ్  నమో ఆప్ పైన తమ సూచనలు చేయాలని లేదా 1800117800 నెంబర్ పై సందేశాన్ని రికార్డు చేసి పంపాలని ప్రధానమంత్రి సూచించారు. ఆకాశవాణి ద్వారా ప్రతి నెల

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలతో తన మనసులోని ఆలోచనలను పంచుకొనే మన్ కి బాత్ ప్రసంగం ఈనెల 28వ తేదీన ప్రసారం అవుతుంది.

FOREIGN SEC - BHUTAN
విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, భూటాన్ విదేశాంగ కార్యదర్శి చోడెన్ ఈరోజు భూటాన్‌లో జరిగిన 3వ ఇండియా-భూటాన్ డెవలప్‌మెంట్ కోఆపరేషన్ చర్చలకు సహ అధ్యక్షత వహించారు. సమావేశంలో, విదేశాంగ కార్యదర్శులు ఇద్దరూ 13వ పంచవర్ష ప్రణాళిక కాలంలో అభివృద్ధి భాగస్వామ్యానికి సంబంధించిన విభిన్న రంగాలలో అమలు విధానాలు సహకారాన్ని సమీక్షించారు. కాగా మిస్రీ భూటాన్‌లో రెండు రోజుల అధికారిక పర్యటనలో ఉన్నారు. విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ నిన్న భూటాన్ ప్రధానమంత్రి షెరింగ్ టోబ్‌గేతో సమావేశమయ్యారు. భూటాన్‌తో భారతదేశం పంచుకుంటున్న స్నేహ సంబంధాలు భారతదేశం-భూటాన్ సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి భారతదేశం కట్టుబడి ఉందని  మిస్రీ పునరుద్ఘాటించారు.